క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శులపై దాడులు ఆపాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

దహెగాం: మేడ్చల్ మండలం రావల్కోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్‌పై గుర్తు తెలియని దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అని మండల పంచాయతీ కార్యదర్శులు అన్నారు. పంచాయతీ కార్యదర్శులపై దాడులను ఆపాలని సోమవారం పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి డీఎల్‌పీవో సురేష్‌బాబు, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్‌లకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి రాజేశ్, ప్రణీత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దంతన్‌పల్లి భీమయ్యక్ జాతర పోస్టర్లు విడుదల



జాతర పోస్టర్లు విడుదల చేస్తున్న జెడ్పీటీసీ

వాంకిడి: దంతన్‌పల్లిలో నిర్వహించే భీమయ్యక్ జాతరకు సంబంధించిన పోస్టర్లను జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 19 నుంచి 23వరకు మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో భీమయ్యక్ దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆత్రం శేషు రావు, ఆత్రం కట్టి పటేల్, ఆత్రం జల్పత్ రావు, ఆత్రం రాము, పాండు తదితరులు పాల్గొన్నారు.

బడి బయట విద్యార్థుల గుర్తింపు



సర్వే చేస్తున్న సీఆర్పీ సందీప్

వాంకిడి: మండలంలోని జైత్‌పూర్ గ్రామంలో బడి బయటి పిల్లల సర్వే నిర్వహించి ముగ్గురు విద్యార్థులను గుర్తించినట్లు సీఆర్పీ దుర్గం సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బడి ఈడు పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాలురను యూఆర్ఎస్ పాఠశాలల్లో, బాలికలను కేజీబీవీల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బడి బయటి పిల్లల సర్వే ఈ నెల 18 వరకు జరుగుతుందని, సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న దేవార వినోద్

రెబ్బెన: దేవార వినోద్ యువసేన ఆధ్వర్యంలో సోమవారం కాగజ్‌నగర్ మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన యువకులకు స్థానిక కనకదుర్గాదేవి ఆలయం వద్ద యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు దేవార వినోద్ క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ



బెజ్జూర్: పూజలు చేస్తున్న శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: అయ్యప్ప స్వాములకు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నప్రసాద వితరణ చేశారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శబరిమలకు బయల్దేరిన అయ్యప్ప భక్తుల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ –అనిత దంపతులను సన్మానించారు. సుమారు 60 మంది అయ్యప్ప స్వాములు బిలాస్పూర్ రైలు ద్వారా అయ్యప్ప స్వామి దర్శనానికి బయల్దేరి వెళ్లారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో సోమవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 32 మంది స్వాములు శబరిమల యాత్రకు వెళ్తుండగా ఇరుముడి కార్యక్రమం చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొని పూజలు చేశారు.

బస్సు రాక ఇక్కట్లు..!

- విద్యార్థులకు కాలినడకే శరణ్యం
- ఇబ్బందుల్లో గంగాపూర్ వాసులు



నడిచి వెళ్తున్న విద్యార్థులు

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్, అంబగట్టు, కోర్సిని గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ సేవలు లేకపోవడంతో విద్యార్థులు, చింతలమానెపల్లి, కౌటాల, రవీంద్రనగర్‌కు సరుకుల కోసం వెళ్లే ప్రజలు ప్రైవేట్ వాహనాలు ఆశ్రయిస్తున్నారు. మండలంలోని రవీంద్రనగర్ నుంచి గంగాపూర్ మీదుగా కోర్సిని సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ మార్గంలో గతంలో బస్సు సర్వీసు కూడా నడిచింది. కాని గత కొద్ది సంవత్సరాలుగా అధికారులు ఈమార్గంలో బస్సు నడిపించడం లేదు. మండలవాసుల వినతుల మేరకు గత సంవత్సరం జనవరి 3న ఆర్టీసీ బస్సును ప్రారంభించిన అధికారులు, ఒక్కరోజే నడిపి మరుసటి రోజు నుంచి మళ్లీ బస్సు సేవలు నిలిపివేయడం గమనార్హం.

మరుసటి రోజే బంద్

గంగాపూర్ గ్రామానికి బస్సు నడిపించాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో స్పందించిన అధికారులు జనవరి 3, 2022న బస్సు సేవలు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామానికి వచ్చిన బస్సుకు తోరణాలు కట్టి, కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. కానీ గ్రామస్తుల ఆనందం ఒక్కరోజుకే పరిమితమైంది. మరుసటి రోజు నుంచే అధికారులు బస్సు సర్వీసును నిలిపివేశారు.

రోడ్డు ఉన్నా..

బస్సు సర్వీస్ నిలిపివేతపై అధికారులను ప్రశ్నిస్తే సరిగా రోడ్డు సౌకర్యం లేకనే బస్సు నిలిపివేసినట్లు పేర్కొన్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగాపూర్ గ్రామానికి రవీంద్రనగర్ నుంచి బీటీ రహదారి ఉంది. ఈ మార్గంలో గతంలో ప్రాణహిత –చేవెళ్ల ప్రాజెక్టు కోసం తవ్విన కాలువపై సుమారు 100మీటర్ల దూరం తాత్కాలిక రోడ్డు వేయగా, ఈ తాత్కాలిక రోడ్డుపై బస్సు నడిపించడం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే ఈమార్గంలో ఇతర భారీ వాహనాలు నడుస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి నూతనంగా నిర్మించిన రహదారి ఉన్నా బస్సు నడిపించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

గ్రామస్తుల ఇబ్బందులు..

గంగాపూర్, అంబగట్టు, కోర్సిని గ్రామాలలోని ప్రజలు నిత్యం అవసరాల కోసం చింతలమానెపల్లి, కౌటాల మండల కేంద్రాలకు వెళ్తుంటారు. ఇక్కడి నుంచి సుమారు 25 మంది ఇంటర్ విద్యార్థులు, మరో 50 మందికి పైగా ఇతర విద్యార్థులు రవీంద్రనగర్, చింతలమానెపల్లి, కౌటాలలోని విద్యాలయాలకు వెళ్తారు. నిత్యం వారు నడుచుకుంటూ, ప్రైవేటు వాహనాలలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంటర్ కోసం నడుచుకుంటూ వెళ్లాల్సి రావడంతో ఇంట్లో తల్లిదండ్రులు చదువు మానేయమంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

చదువు మానేయాల్సిన పరిస్థితి



కళాశాలకు వెళ్లడానికి 5కిలోమీటర్లు, ఇంటికి రావడానికి 5కిలోమీటర్లు ఇలా ప్రతీరోజు 10 కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. దీంతో మా ఊరిలో 15 మంది వరకు విదార్థినులు కళాశాలకు వెళ్లడం లేదు. బస్సు లేక చదువు మానేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

– కొట్రంగి లక్ష్మి, విద్యార్థిని, గంగాపూర్

ఇబ్బంది పడుతున్నాం



మా ఊరి నుంచి రవీంద్రనగర్ వరకు నడిచి వెళ్తున్నాం. సాయంత్రం ఒక్కోసారి చీకటి పడుతోంది. నడిచి రావడంతో ఇంటికెళ్లే సరికి అలసిపోతున్నాం. బస్సు లేకపోవడంతో ఇబ్బంది తప్పడం లేదు.

– దంద్రె హరీష్, విద్యార్థి, గంగాపూర్

ప్రజల కష్టాలు తెలిసిన వారినే ఆదరించండి

- ప్రతిపక్షాల మాయమాటలు నమ్మొద్దు
- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూర్: నియోజకవర్గ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు రాని ప్రతిపక్ష నాయకులు ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, ఎంపీపీ రోజారమణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనసభకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి హాజరయ్యారు. ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ మండలానికి ఇప్పటివరకు రూ.130 కోట్ల నిధులు వచ్చాయన్నారు. పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు హక్కు పత్రాలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో పార్టీ కార్యకర్తలు ముందుండి పోడు భూములు దున్నిస్తారని పేర్కొన్నారు.

పోడు భూముల కోసం జైలు జీవితం : ఆత్రం సక్కు

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ పోడు భూముల కోసం జైలు జీవితం గడిపిన కుటుంబం కోనేరు కుటుంబమన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవా కార్యక్రమాలతో నియోజకవర్గాన్ని కోనప్ప ఎంతగానో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆత్మీయ సమ్మేళనానికి ముందు మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే విగ్రహం నుంచి హెలిప్యాడ్ సభ స్థలం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొంద్ర జగ్గాగౌడ్, జెడ్పీటీసీ పుష్పలత, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ ప్రకాశ్, మాజీ చైర్మన్ వెంకన్న, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, ఎంపీపీ దుబ్బుల నానయ్య, నాయకులు జావీద్ అలీఖాన్, సతీష్, నాహెర్ అలీ, రామకృష్ణ, హుస్సేన్, మహేశ్, దేవాజీ, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోనప్ప సేవలు అభినందనీయం

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నియోజకవర్గ అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కేంద్రాన్ని సందర్శించారు. నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు స్థానిక బస్టాండ్ ఎదురుగా నిత్యాన్నదాన సత్రం ద్వారా అనేక మంది పేదల ఆకలి తీర్చడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనప్పతో కలిసి పేదలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి



వరుణ్ రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

వాంకిడి: మండలంలోని దొడ్డిగూడ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సోమవారం గ్రామ కోలాం సంఘ నాయకులు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డిని ఉట్నూర్‌లోని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సంఘ సమావేశాలు నిర్వహించేందుకు, ఇతర అవసరాల నిమిత్తం కమిటీ హాల్ మంజూరు చేయాలని, ఎనగొంది గ్రామానికి సమీపంలోని వాగుపై వంతెన నిర్మించాలని కోరారు. నిరుపేద కుటుంబాలకు ఒక జత ఎడ్లు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం పీవోను శాలువాతో సన్మానించారు. గ్రామ ఉపసర్పంచ్ మారుతి, గ్రామస్తులు లింగు, మెంగు, గంగారాం, మారు, సురేష్ ఉన్నారు.

కరాటేలో ప్రతిభ



పతకాలు సాధించిన జశ్వంత్, సాయిమోక్షేశ్

రెబ్బెన(ఆసిఫాబాద్): పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో రెబ్బెన మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ చాపిడి కుమార్ తెలిపారు. కటాస్ విభాగంలో జస్వంత్, సాయి మోక్షేశ్ బంగారు పతకాలతోపాటు సర్టిఫికెట్లు సాధించినట్లు వెల్లడించారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్ల అందజేత

ఆసిఫాబాద్: మండలంలోని గుండి గ్రామంలో సోమవారం 8 మంది గర్భిణులకు కేసీఆర్ పౌష్టికాహార కిట్లను సర్పంచ్ జాబరి అరుణ రవీందర్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం పోషకాహార కిట్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మోహన్, ప్రవీణ్, మల్లేశ్, ఏఎన్ఎం సంగీత, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆసిఫాబాద్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి



ఆసిఫాబాద్‌అర్బన్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్: తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటేరినరియన్స్ అసోసియేషన్ కొత్త సంవత్సరం క్యాలెండర్లను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేశ్ కుమార్, ఏడీ రమేశ్, జిల్లా కేంద్రంలోని శాఖ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్, సహాధ్యక్షుడు పద్మ, కార్యదర్శి ప్రభుకుమార్, కోశాధికారి సుప్రియ, ఉపాధ్యక్షుడు నాగన్న, సునీల్, జాయింట్ సెక్రెటరీ రాజ్‌కుమార్, ప్రేమకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శైలేందర్, సూపరింటెండెంట్ రమేశ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ రియాజ్, సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్పీ

ఆసిఫాబాద్‌అర్బన్: 2023 జిల్లా పోలీసు శాఖకు సంబంధించిన నూతన క్యాలెండర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్‌లో జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వర్‌రావ్, అదనపు ఎస్పీ (ఏఆర్) భీంరావ్, పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి, సభ్యులు మోహన్, స్వామి, దేవాజీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్.

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కులు ఆవిష్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, సదాశివ్, వెంకట్రావ్, ధన్‌రాజ్, రవి, ప్రకాష్, మధుకర్, జలపత్ రావ్, శ్రావణ్, క్రుష్ణమూర్తి, రవి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్..

కాగజ్‌నగర్‌రూరల్: భట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్లను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. దేవాజీ, రమేశ్, వరలక్ష్మి, చంద్రశేఖర్, బిక్షపతి, శ్రావన్‌కుమార్, నాగేశ్వర్‌రావు, సుధాకర్, జ్యోతి, శ్రీనివాస్, మధూకర్, సమత, మంగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌అర్బన్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం

పెంచికల్‌పేట్: మండలంలోని బొంబాయిగూడ గ్రామానికి చెందిన డోకె రాములు ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మూడు క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. సోమవారం సాయంత్రం ఇంట్లో విద్యుత్ తీగలు తెగిపోయి పత్తి కుప్పపై పడటంతో మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో మంటలు ఆర్పివేశారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

కెరమెరి: మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని మండల ప్రత్యేకాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని రింగన్‌ఘాట్, కల్లెగాం పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం తొలిమెట్టులో భాగంగా పలువురు విద్యార్థులతో బోర్డుపై తెలుగు, ఆంగ్లం రాయించారు. చదివించారు. హెచ్ఎంలు రతన్, కిషన్ ఉన్నారు.

నేడు అంగారిక చతుర్థి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలోని శ్రీ గణేష్ మందిర్‌లో నేడు అంగారిక చతుర్థి పురస్కరించుకొని సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు శ్రీనివాస్‌శర్మ, ఒజ్జల శిరీష్‌శర్మలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలని, గత 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను సత్వరమే చెల్లించాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఈఈ నాగేశ్వర్‌రావ్‌కు తన కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ 3నెలల వేతనాలను విడుదల చేయాలని, జీఓ 11ని అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై అధికారుల వేధింపులు అరికట్టాలని, ఎల్ఎన్‌టీ, రాఘవ కంపెనీ యాజమాన్యం పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. సమస్యలపై ఈనెల 23న నిర్వహించే రాష్ట్ర సదస్సులో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హరీష్, ఈశ్వర్, అంబారావ్, పాండురంగ్, వెంకటేష్, బాలేష్, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.

'ఎక్స్‌సర్వీస్‌మెన్' భవనానికి స్థలం కేటాయింపు



బోర్డు ఏర్పాటు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోషియేషన్ భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్‌రోడ్ విద్యాధరి పాఠశాల పక్కన త్రిశూల్ పహాడ్‌కు ఆనుకుని ఉన్న స్థలాన్ని కేటాయించగా సోమవారం అసోసియేషన్ సభ్యులు స్థలంలో ఫెన్సింగ్‌తో పాటు బోర్డ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్‌మెన్ అసోషియేషన్ అధ్యక్షుడు కెప్టెన్ అబ్దుల్ నయీమ్, ప్రధాన కార్యదర్శి సునీల్ మండల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ, అడ్వైజర్లు నరేందర్ యాదవ్, అనురోధ్, విజయ్, నీరజ్ సింగ్, అజయద సింగ్, సభ్యులు కుమార్, అజయ్, మిశ్రా, గణేష్ మండల్, తపన్, శంకర్, ముఖేష్ సింగ్, అన్వర్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు శుభ్రం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న ఎంఐఎం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగన్ కాలనీతో పాటు పలు కాలనీలలోని మెయిన్‌రోడ్డు మురికి కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వెంటనే శుభ్రం చేయాలని పట్టణ మాజీ ఎంఐఎం అధ్యక్షుడు అబ్దుల్ హన్నన్ కోరారు. ఈమేరకు సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శి వంశీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయడంతో పాటు, స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాలనీవాసులు సల్మా బేగం, షేక్ నజీర్, కలావతి, రేష్మా బేగం ఉన్నారు.

అటవీ అధికారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

తిర్యాణి: పెసా గ్రామసభ తీర్మానాన్ని ఉల్లంఘించిన అటవీ శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు మాట్లాడుతూ కన్నెపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన పెసా గ్రామసభ తీర్మాణం మేరకు అరటిపల్లి స్టేజీ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయగా తొలగించిన అటవీ శాఖ అధికారి సంతోష్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రంతో పాటు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ధర్ము, కోట్నాక గణపతి, సీతారాం, బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

జాడలేని ఎస్ఎంసీలు..!

- కమిటీ సభ్యులకు కరువైన శిక్షణ
- పర్యవేక్షణ లేక అందని నాణ్యమైన విద్య, భోజనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



తలాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

బెజ్జూర్: సర్కారు బడుల అభివృద్ధికి పాటుపడాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఎంసీ) కమిటీలు జాడ లేకుండా పోయాయి. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ కమిటీలను నియమించింది. కానీ కమిటీ సభ్యులకు శిక్షణ ఇవ్వడాన్ని విస్మరించడంతో ఇవి నామమాత్రంగానే మిగిలిపోతున్నాయి. ఎస్ఎంసీ కమిటీలను సమన్వయం చేసుకుంటూ సర్వశిక్ష అభియాన్ ద్వారా ఆయా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుంది. కానీ పాఠశాలల పనితీరు, విద్యాభివృద్ధి, తదితర అంశాలకు సంబంధించి తనిఖీలు చేపట్టడం లేదు. దీని ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందకుండా పోతోంది. బెజ్జూర్ మండలంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు 3 జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలు, 4 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, 5 ఎంపీయూపీఎస్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు 31, ఎంపీపీఎస్ 41 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 4,890 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో అనేక సమస్యల నడుమ విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు.

సమావేశాలు లేవు..

సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రతీ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులను సభ్యులుగా ఎన్నుకున్నారు. మండలంలోని పాఠశాలల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్, ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్‌లు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంటుంది. అయితే జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా సమావేశాలు జరిగిన దాఖలాలు కనిపించడం లేదు.

అవగాహన లేక..

ఎస్ఎంసీ కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వారు చేపట్టాల్సిన విధుల పట్ల శిక్షణ ఇవ్వడం మరిచింది. దీంతో ఏవిధంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్న విషయాన్ని సభ్యులు తెలుసుకోలేక పోతున్నారు. ఎస్ఎంసీల బాధ్యతలు, ఇతర విషయాలపై సభ్యులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించలేదు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ పనితీరు మెరుగుపడితే సర్కారు బడులు అభివృద్ధి చెందుతాయి. కమిటీ సభ్యులు పాఠశాలలను తనిఖీ చేయడంతో పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందుతుంది. ప్రతీరోజు పాఠశాలకు ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా విధులు హాజరవుతారు. దీంతోపాటు వారిలో జవాబుదారితనం పెరుగుతుంది. విద్యాశాఖ అధికారులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాఠశాలలను పర్యవేక్షించి తనిఖీలు చేపడితే సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.